క్లుప్తంగా

సచివాలయాలకు డిఏలు లేక అవస్థలు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో ఉన్న రెండు సచివాలయాలకు డిజిటల్(డీఏలు) సహాయకులు లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రేషన్ కార్డుల్లో మార్పులు, ఆధార్ కార్డుల్లో మార్పులు, ఇంటి స్థలాల నిమిత్తం, గృహాలనిమిత్తం సచివాలయాల్లో డీఏల ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రభుత్వంమార్గదర్శకాలు విడుదల చేయడంతో లబ్ధిదారులందరూ సచివాలయాలకు వస్తే డీఏలు లేరని చెప్పడంతో వెనుదిరగాల్సి వస్తోందని అంటున్నారు. రెండు సచివాలయాల్లో ఇద్దరు డీఏలు లేక పోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని బుద్ధిపేట, సీతానగరం అప్పయ్యపేట, పెదభోగిలి గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డీఏల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం తీరు అమానుషం


లిల్లీ పుష్పనాథం

పాలకొండ: కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అమానుషంగా ఉందని వైఎస్సార్‌సీపీ పెన్షనర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు వై. లిల్లీ పుష్పనాథం అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కంటే రెడ్‌బుక్ పాలనే ఎక్కువగా సాగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి విడదల రజినీపై పోలీసులు దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. అలాగే గుంటూరు జిల్లా కంతేరులోను దళిత ఎంపీటీసీ సభ్యురాలు కల్పనను రాత్రి సమయంలో అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దుస్తులు మార్చుకోవడానికి కూడా అవకాశం ఇవ్వకుండా నైటీలోనే అరెస్ట్ చేయడం అమానుషమన్నారు. మహిళలపై దారుణాలకు పాల్పడుతున్న వారు తగిన ఫలితం అనుభవించక తప్పదన్నారు.

మహిళలంటే ఇంత అలుసా..!

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: కూటమి ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండువలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చిలకలూరుపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం జంగాలపల్లి గ్రామంలో మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీకాంత్ రెడ్డిని అకారణంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి రజనీపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని చెప్పడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు. ఇటువంటి చర్యలు మానుకోకపోతే కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని తెలిపారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి..


పాలకొండలో వాహన తనిఖీలు చేస్తున్న సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: వాహన చోదకులు తమ వెంట తప్పనిసరిగా ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సీఐ ఎం. చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి అన్నారు. విశాఖ, సీతంపేట, వీరఘట్టం రహదారుల్లో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు పరిశీలించి, వివరాలు సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు.

● ఆరగించే ముందు.. ఆలోచించండి!



వేసవి.. మామిడి పండ్ల సీజన్. ఈ కాలంలో మామిడి పండ్లు తిననివారుండరు. ఎంతో ఇష్టంగా తినే ఈ పండ్లను ఆరగించే ముందు కాస్త ఆలోచించండి అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మామిడికాయలను సహజ పరిస్థితుల్లో మగ్గించకుండా కృత్రిమంగా రసాయనాలతో మగ్గించి అమ్మేస్తున్నారు. ఇప్పుడు ఎక్కడపడితే అక్కడ కార్బైడ్ ద్వారా మగ్గించిన పండ్లే కనిపిస్తున్నాయి. నిగనిగలాడే ఈ పండ్లు తినడం వల్ల నాడీవ్యవస్థ దెబ్బతినడంతో పాటు కేన్సర్ సోకే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో పండ్లు కొనుగోలు చేసే ముందు జాగ్రత్త వహించాలని చెబుతున్నారు. ఎండుగడ్డితో మగ్గించిన పండ్లు తింటే ఆరోగ్యమని సూచిస్తున్నారు. – గరుగుబిల్లి



రహదారులు నిర్మానుష్యం


ఎండల కారణంగా సందడిగా లేని ఖడ్గవలస జంక్షన్

- ఎండవేడికి అల్లాడుతున్న ప్రజలు

పార్వతీపురం:

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ధాటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటలు దాటితే ఇళ్లనుంచి బయటకు వచ్చే పరిస్థితి కనబడడం లేదు. బయటకు వచ్చిన ప్రజలు ఎండ తీవ్రతకు తట్టుకోలేక చల్లని చెట్లను ఆశ్రయిస్తున్నారు. ఓ వైపు ఉక్కపోత, మరో వైపు ఎండ తీవ్రత వల్ల మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరడంతో ప్రజలు బయటకు రావడానికి భయాందోళన చెందుతున్నారు. కాగా వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత వేడిగాలుల కారణంగా ప్రజలు ఆరోగ్యం కాపాడుకునేందుకు పలు జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే వడదెబ్బకు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు హెచ్చరిస్తూ పలుసూచనలు చేస్తున్నారు.


ఎట్టణంలో ఎండల కారణంగా గొడుగు వేసుకుని వెళ్తున్న మహిళలు

వడదెబ్బ సోకితే..ప్రథమ చికిత్స ఇలా..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీరం ఉష్ణోగ్రత సాధారణ స్థాయి వచ్చేవరకు అలాగే చేస్తుండాలి. చల్లనిగాలి తగిలే విధంగా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో వున్న వ్యక్తికి నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకువెళ్లాలి.
- తెలుపు రంగు పలుచటి వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ లేదా టవల్ కట్టుకోవాలి.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్యకాలంలో అధిక శారీరక శ్రమ చేయకూడదు.
- శీతల పానీయాలు ఐస్‌ముక్కలు తీసుకుంటే గొంతుకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- రోజుకు కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలి.

నేడు తోణాం పీహెచ్‌సీ ప్రారంభం

- గత ప్రభుత్వంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం
- మాజీ డిప్యూటీ సీఎం చొరవతో..
- 5 పీహెచ్‌సీలు, 100 పడకల ఆస్పత్రి నిర్మాణం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తోణాం పీహెచ్‌సీ కొత్త భవనం

సాలూరు రూరల్: ఎన్నడూ లేని విధంగా గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారనే చెప్పవచ్చు. అందుకు ఉదాహరణగా సాలూరు పట్టణంలోని 100 పడకల ఆస్పత్రి నిర్మాణం అలాగే నియోజకవర్గంలోని సాలూరు మండల కేంద్రం, తోణాం, మామిడిపల్లి, మక్కువ, మెంటాడ దండలాల్లో పీహెచ్‌సీల నిర్మాణానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నిధులు మంజూరుచేయించి పనులు ప్రారంభించడంతో పాటు దాదాపు పూర్తి చేశారు. అయితే మెంటాడ మండలంలోని చల్లపేట పీహెచ్‌సీ భవనం ఇప్పటికే ప్రారంభించారు. అలాగే తోణాం పీహెచ్‌సీ పనులు రూ.182.1లక్షలతో పూర్తిచేశారు. విద్యుత్ లైన్ వేసి ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.

విద్యుత్ లైన్ కలిపి ప్రారంభించడానికి ఏడాది

ఒక్క విద్యుత్ లైన్ పూర్తిచేసి తోణాం పీహెచ్‌సీ కొత్త భవనాన్ని ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకు రావడానికి కూటమి ప్రభుత్వానికి ఏడాది కాలం పట్టింది. ఎట్టకేలకు గత ప్రభుత్వంలో పూర్తయిన తోణాం పీహెచ్‌సీ భవనాన్ని గిరిజన శాఖమంత్రి సంధ్యారాణి సోమవారం ప్రారంభించేందుకు సిద్ధమవడం హర్షణీయం. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి నిరంతర ప్రక్రియ ఏ ప్రభుత్వం ప్రజలకు మంచిచేసే పనులు ప్రారంభించినా అవి నిర్ణీత సమయంలోగా పూర్తికాకపోవడం, ఇతర కారణాలతోనో మధ్యలో నిలిచిపోయిన పనులు పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఉంటుంది. ప్రజలకు వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రితో పాటు 5 పీహెచ్‌సీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాం. ఎన్నికల కోడ్ కారణంతో చివరి దశలో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం తోణాం పీహెచ్‌సీ భవనం ఎవరు పూర్తిచేసినప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానుండడం సంతోషకరం.



– పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

సాకిగెడ్డపై దృష్టి సారించండి

- ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలి
- గెడ్డను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు


సాకిగెడ్డను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: వర్షాలు రాకుండా ముందుగానే పార్వతీపురం మండలంలోని సాకిగెడ్డకు చేయాల్సిన మరమ్మతులపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు స్థానిక మండల నాయకులతో కలిసి సాకిగెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాకిగెడ్డ నుంచి వచ్చే నీరు ప్రవహించే వంతెన తూములు మొత్తం చెట్లు తుప్పలు, చెత్త చెదారంతో నిండిపోయాయన్నారు. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని. వర్షాకాలానికి ముందే సాకిగెడ్డలో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. అలాగే తూములను అడ్డుకున్న చెత్తాచెదారాన్ని, చెట్లు తుప్పలను తొలగించాలన్నారు. ప్రతి ఏటా సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల గెడ్డ పొంగినప్పుడు నీరు ప్రవహించేందుకు తూముల వద్ద చెట్లు చెత్త అడ్డుగా ఉండడంతో నీరు ప్రవహించేందుకు అవకాశం లేక నీరు రోడ్డు పైకి వస్తోందన్నారు. దానివల్ల సుమారు 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని అలాగే పంట పొలాలు నీట మునుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గెడ్డ ఉధృతంగా వచ్చేటప్పుడు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. వర్షాలు రాక ముందే మండలంలోని పుట్టూరు లచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఉన్న సాకిగెడ్డ వద్ద నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా, ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పరిశీలనలో పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గేదెల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


అంతర్రాష్ట్ర రహదారి వైపు వాలి ఉన్న చెట్టు కొమ్మ

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం శివారు వసుంధర నగర్ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారికి రెండు వైపులా ఉన్న చెట్లలో ఒక వైపు చెట్టు కొమ్మ సగానికి తెగి రహదారి వైపు వాలి ఉంది. దీంతో రాకపోకలు సాగించే వాహనాలపై ఈదురు గాలులకు అకస్మాత్తుగా చెట్టు కొమ్మ పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు జరిగే క్రమంలో చెట్టు కొమ్మ కారణంగా ప్రమాదం జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


సగభాగం తెగిన చెట్టు కొమ్మ

ఆస్పత్రి పనులు పూర్తయ్యేదెప్పుడు..?

సీతంపేట: స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పూర్తయ్యేదెప్పుడని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా ఇప్పటివరకు ఆస్పత్రి పనులు పూర్తి కాలేదన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సకాలంలో పనులు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆస్పత్రిలో 15 మంది వైద్యులున్నా రోగులకు సరిపడా పడకలు లేవన్నారు. అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

లక్ష్మీనృసింహ స్వామికి పంచామృతాభిషేకాలు


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు


స్వామికి అర్పించిన పంచామృతాలు, ప్రసాదాలు

సీతానగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి తిరునక్షత్రం ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులతో అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లక్ష్మీనృసింహస్వామి జయంతిని పురస్కరించుకుని ఆదివారం వందలాదిమంది భక్తులతో పంచామృతాలను తయారుచేయించి వివిధ రకాల పండ్లు, పూజాసామగ్రితో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు సీహెచ్‌వీ రాజశేఖర్ కుటుంబసభ్యులు, సిటీ కేబుల్ నిర్వాహకుడు సీహెచ్‌వీ గోపాలకృష్ణ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.


పాల్గొన్న సీహెచ్‌వీ గోపాలకృష్ణ, దంపతులు

కనిపించే దేవుళ్లు తల్లిదండ్రులు


వైటీసీలో నిర్వహిస్తున్న కార్యక్రమం

సాలూరు: మనకు కనిపించే దేవుళ్లు తల్లిదండ్రులని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతిగృహంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మదర్స్‌డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో తల్లిచేసే త్యాగాలు గొప్పవన్నారు. బిడ్డకు బాధ కలగకుండా ఉండేందుకు తల్లి ఎన్నో బాధలను దిగమింగుతుందని పేర్కొన్నారు. అందరికి మదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారి సిస్టర్స్ బృందం కేక్ కట్ చేసి, చీరలు పంపిణీ చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.వాసవిక్లబ్ ప్రెసిడెంట్, వాసవి క్లబ్ ఉమెన్ ప్రెసిడెంట్ ,బృందం పండ్లు, పోషకాహారాలను అందజేశారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన రైల్వేలైన్ అండర్ గ్రౌండ్ రోడ్డు


చినభోగిలి కాలనీ వద్ద జరుగుతున్న రైల్వేపనులు


రెండు కాలనీల మధ్య రైల్వేట్రాక్‌పై నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి

సీతానగరం: మండలంలోని చినభోగిలి-మక్కువ రాష్ట్రీయ రోడ్డును ఆనుకుని రాయ్‌పూర్-విశాఖ రైల్వే ట్రాక్‌పై అండర్‌గ్రౌండ్ బీటీ రోడ్డు పనులు పూర్తి కావస్తుండడంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. చినభోగిలి రైల్వేగేటును దాటుకుని నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడతాయి. ట్రైన్‌ల సంఖ్య పెరడంతో నిరంతరం గేటు పడడం వల్ల వందలాది వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూడు నియోజకవర్గాలకు చెందిన వందలాది వాహనాలు తిరుగాడే రోడ్డుపై 2023–24 ఆర్థిక సంవత్సరంలో అండర్‌గ్రౌండ్ రోడ్డు నిర్మించాలని సంకల్పించడంతో బక్కుపేట జంక్షన్, చినభోగిలి కాలనీని ఆనుకుని ఉన్న రెండు ప్రాంతాలను అప్పట్లో పరిశీలించారు. చివరకు చినభోగిలి కాలనీల మధ్య నుంచి-మక్కువ రోడ్డుకు అనుసంధానం చేస్తూ రైల్వేశాఖ ట్రాక్ కిందనుంచి అండర్ గ్రౌండ్ బీటీ రోడ్డు నిర్మాణానికి 10 రోజుల క్రితం పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతో మూడు ట్రాక్‌ల కిందనుంచి బ్రిడ్జి నిర్మాణం జరిగింది. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులకు రెండువైపులా కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. పనులు పూర్తయితే రాష్ట్రరహదారి(2 నంబర్ రోడ్డు) మక్కువ-అజ్జాడ రోడ్డులో చినబోగిలి వద్ద రైల్వే ట్రాక్‌పై పెరిగిన ట్రైన్లు తిరుగాడడం, నూతనంగా పెరిగిన ట్రాక్‌ల కారణంగా గంటల తరబడి నిలిచిపోయే వందలాది వాహనాలకు త్వరలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

పార్వతీపురంటౌన్: సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై రాజకీయ నాయకులు జులుం ప్రదర్శించడం సరైన విధానం కాదన్నారు. మీ బాధలు వినడం మా పని కాదంటూ స్వయానా మంత్రి చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించి క్రమ బద్ధీకరించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా పితృత్వ సేవలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


కళిశెట్టి సురేష్

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన కళిశెట్టి సురేష్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సురేష్.. ఇప్పటివరకు ఇంటికి రాలేదని, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి నాబంధువులను వాకబు చేసినా ఫలితం లేదని తండ్రి ధనంజయ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీడనిస్తున్న విశ్రాంతి భవనాలు


కాట్రగడ-బి వద్ద నిర్మించిన విశ్రాంతి భవనం


బత్తిలి కొత్త కాలనీ వద్ద ఆకర్షణీయంగా రెస్ట్ షెడ్

భామిని: మండలంలోని కాట్రగడ – బి, బత్తిలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్మించిన విశ్రాంతి భవనాలు ప్రయాణికులకు నీడనిస్తూ ఆకట్టుకుంటున్నాయి. పార్టీ జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, ఎంపీపీ తోట శాంతి కుమారి పర్యవేక్షణలో కాట్రగడ సర్పంచ్ తోట సరస్వతమ్మ ఆధ్వర్యంలో కాట్రగడ-బి ఏబీ రోడ్డు కూడలిలో విశ్రాంతి భవనం నిర్మించారు. గతంలో 35 ఏళ్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేసిన తోట నారాయణ జ్ఞాపకార్థం ఈ నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా బత్తిలి మేజర్ పంచాయతీ సర్పంచ్ టింగ శాంతి కుమారి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు పర్యవేక్షణలో బత్తిలి కొత్త కాలనీ – పాతకాలనీ కూడలిలో రెస్ట్ హౌస్ నిర్మించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన ఈ భవనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పలువురు చెబుతున్నారు.